సాక్షి ఆదిలాబాద్

శనివారం | 27 | మే | 2023

పల్లె క్రీడా కెరటాలు



సీఎం కప్ క్రీడా పోటీలతో ప్రతిభ గల గ్రామీణ క్రీడాకారులు వెలుగులోకి వచ్చారు. మండల, జిల్లాస్థాయిలో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు.

10లో▸

'కాంగ్రెస్‌ను గెలిపిస్తే రూ.2లక్షల రుణమాఫీ'

జైనథ్: కాంగ్రెస్‌ను గెలిపిస్తే ఏకకాలంలో రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని మాజీ మంత్రి రాంచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని బెల్లూరి గ్రామంలో శుక్రవారం ఇంటింటికి మన కాంగ్రెస్ కార్యక్రమంలో పాల్గొన్నారు. వరంగల్ రైతు డిక్లరేషన్, కాంగ్రెస్ పార్టీ హామీలను ప్రజలకు వివరించారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 41.0 /28.0

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతీవ్రత పెరగనుంది. వడగాలులు వీస్తాయి. ఉక్కపోత ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

రిమ్స్, ఉట్నూర్ ఆస్పత్రులకు ముస్కాన్ అవార్డు



రిమ్స్ ఆస్పత్రి

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని రిమ్స్, ఉట్నూర్ ఆస్పత్రులు ముస్కాన్ అవార్డుకు ఎంపికయ్యాయి. ఈమేరకు నేషనల్ హెల్త్ మిషన్ సంయుక్త కార్యదర్శి విశాల్ చౌహాన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏడు ఆస్పత్రులు ఈ అవార్డుకు ఎంపిక కాగా ఇందులో జిల్లా నుంచే రెండు ఉండడం గమనార్హం. ఈ నెల 3న కేంద్ర ముస్కాన్ బృందం సభ్యులు రిమ్స్, ఉట్నూర్‌లోని ఆస్పత్రులను పరిశీలించారు. ఎస్ఆర్‌సీ, ఎస్ఎన్‌సీయూ, పీడీయాట్రిక్ వార్డు, ఓపీడీ సేవలను పరిశీలించి వసతులపై ఆరాతీశారు. అవార్డుకు ఎంపికైన ఆస్పత్రులకు ఏడాదికి రూ.12 లక్షల చొప్పున మూడేళ్ల పాటు రూ.36 లక్షలు అందుతాయి. వీటిని చిల్డ్రన్స్ వార్డు అభివృద్ధికి కోసం కేటాయిస్తారు. అవార్డు దక్కడంపై రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, ఉట్నూర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ హర్షం వ్యక్తం చేశారు. మరింత నాణ్యమైన సేవలు అందించేందుకు చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

గ్రామాల్లో పర్యటించిన ట్రెయినీ కలెక్టర్



మన ఊరు- మన బడి పనులను పరిశీలిస్తున్న ట్రెయినీ కలెక్టర్ వికాస్

ఇంద్రవెల్లి: మండలంలోని దనోరా(బి), కేస్లాపూర్, అందునాయక్‌తండా గ్రామాల్లో ట్రెయినీ కలెక్టర్ వికాస్ మహతో శుక్రవారం పర్యటించారు. దనోరా(బి)లో ఈజీఎస్ నర్సరీని పరిశీలించారు. మొక్కలు ఎండిపోకుండా జాగ్రతలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అక్కడ నుంచి కేస్లాపూర్‌లోని నాగోబా ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అందునాయక్‌తండాలో మన ఊరు–మన బడిలో భాగంగా నిర్మించిన పాఠశాల అదనపు తరగతి గదులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీవో సంతోష్, పంచాయతీరాజ్ ఏఈ లింగన్న,మేజర్‌పంచాయతీఈవో సంజీవ్‌రావ్ తదితరులున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో ప్రవేశం కోసం వెనుకబడిన తరగతులకు చెందిన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ శాఖ జిల్లా అభివృద్ధి అధికారి రాజలింగు ప్రకటనలో తెలిపారు. 2022–23లో పదో తరగతిలో 7జీపీఏ పైబడి ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని పేర్కొన్నారు. ప్రభుత్వ వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలలు, కస్తూరిబా, ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఉండాలని తెలిపారు. తల్లిదండ్రుల వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల వారైతే రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల వారైతే రూ.2లక్షల లోపు ఉండాలని పేర్కొన్నారు. అర్హులైన వారు జూన్ 3 వరకు ఈ పాస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మెరిట్ ప్రకారం ఎంపిక ఉంటుందని తెలిపారు. ఎంపికైన వారి వివరాలను సెల్ మెసేజ్‌తో పాటు ఆన్‌లైన్ ద్వారా జూన్ 7న వెల్లడిస్తామని పేర్కొన్నారు. అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ భోజారెడ్డి

బేల: జూన్ 2నుంచి 21రోజుల పాటు నిర్వహించనున్న తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా చేపట్టాలని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని జెడ్పీటీసీ సతీశ్‌పవార్ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ప్రజల సమక్షంలో ఆయా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్, బీజేపీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. సమావేశంలో బేల సహకార సంఘం చైర్మన్ బాలచందర్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రాత్రే గంభీర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు స్కూల్ బస్సును పరిశీలిస్తున్న డీటీసీ (ఫైల్)



బడి బస్సు భద్రమేనా?

ఉమ్మడి జిల్లాలో ప్రైవేట్ పాఠశాలల బస్సుల ఫిట్‌నెస్ వివరాలు			
జిల్లా	ఫిట్‌నెస్ ఉన్నవి	ఫిట్‌నెస్ లేనివి	మొత్తం బస్సులు
ఆదిలాబాద్	08	115	123
నిర్మల్	18	270	288
కుమురంభీం	04	96	100
మంచిర్యాల	38	415	453

- జూన్ 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం
- ఫిట్‌నెస్ పరీక్షలపై యాజమాన్యాల నిర్లక్ష్యం
- కాలం చెల్లిన వాహనాలతో విద్యార్థులకు ప్రాణసంకటం

ఆదిలాబాద్‌టౌన్: బడి బస్సుల భద్రత ఆందోళన కలిగిస్తోంది. విద్యార్థులను ఇంటి నుంచి పాఠశాలకు తరలించే ఇవి ఫిట్‌లెస్‌గా మారుతున్నాయి. వాహనాల కండీషన్‌ను పరీక్షించి ఎప్పటికప్పుడు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకోవాల్సిన స్కూల్ యాజమాన్యాలు పట్టించుకోవడం లేదు. బస్సుల సామర్థ్యాన్ని పరిశీలించాల్సిన సంబంధిత శాఖ అధికారులు సైతం ఆ దిశగా దృష్టి సారించడం లేదనే విమర్శలున్నాయి. ఫలితంగా కాలం చెల్లిన బస్సులను నడుపుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. మరోవైపు జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఉమ్మడి జిల్లా పరిధిలో మొత్తం స్కూల్ బస్సులు 964 ఉండగా కేవలం 68 మాత్రమే ఫిట్‌నెస్ కలిగి ఉండడం గమనార్హం. ఈ నేపథ్యంలో బడి బస్సు భద్రతపై సర్వత్రా అనుమానం వ్యక్తమవుతోంది.

తల్లిదండ్రుల్లో ఆందోళన

జూన్ 12 పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. దీంతో బస్సు భద్రతపై విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. బస్సులో సీట్లు, అద్దాలు, టైర్లు, తదితర సామగ్రి అన్ని సక్రమంగా ఉన్నాయా.. లేదా.? అనేది చూసుకోవాలని రవాణా శాఖ అధికారులు సూచిస్తున్నారు. స్కూల్ బస్సులకు సంబంధించి 32 అంశాలతో కూడిన నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. ఇందులో ప్రధానంగా ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్ తప్పనిసరి. అలాగే డ్రైవర్ వయసు 60 ఏళ్లకు మించొద్దు. బస్సులో విద్యార్థుల వివరాల పట్టిక నమోదు చేసి ఉంచాలి. అలాగే వాహనాలను 15 ఏళ్లు మించి నడపరాదు. ఈ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాల్సిన బాధ్యత ఆయా పాఠశాలల యాజమాన్యాలపై ఉంది. అయితే జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా చాలా పాఠశాలలు కండీషన్ లేని బస్సుల్లో విద్యార్థులను తరలిస్తున్నారు. దీంతో అప్పుడప్పుడు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రవాణా శాఖ అధికారులు ఏటా పాఠశాలల పునఃప్రారంభం తర్వాత కేవలం వారం పాటు తనిఖీలు నిర్వహించి వదిలి పెట్టడంతో ఆయా పాఠశాలల యాజమాన్యాలు దీనిని పెద్దగా పట్టించుకోవడం లేదని తెలుస్తోంది.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

ఆదిలాబాద్ జిల్లాలో మొత్తం 167 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 37,640 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో సగానికిపైగా విద్యార్థులు స్కూల్ బస్సుల్లోనే ఇంటి నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. జిల్లాలో ఆయా ప్రైవేట్ పాఠశాలలకు గాను 123 స్కూల్ బస్సులు ఉన్నాయి. వీటికి మే 15వ తేదీతో ఫిట్‌నెస్ గడువు ముగిసింది. అయితే ఇప్పటి వరకు కేవలం 8 వాహనాలు మాత్రమే ఫిట్‌నెస్ సాధించడం గమనార్హం. అలాగే దాదాపు అన్నిబస్సులకు ఇన్సూరెన్స్ గడువు సైతం ముగిసింది.

ఫిట్‌నెస్ తప్పనిసరి



ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలు స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌ను బడులు తెరవ ముందే చేయించుకోవాలి. నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. ఫిట్‌నెస్ లేకుండా బస్సు రోడ్డు ఎక్కితే సీజ్ చేస్తాం. విద్యార్థులు అసౌకర్యానికి గురికాకుండా బస్సులో అన్ని సౌకర్యాలు కల్పించాలి. నిబంధనలకు సంబంధించి డ్రైవర్లు, యాజమాన్యాలకు శిక్షణ నిర్వహిస్తాం. సేఫ్టీ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తాం.

– పుప్పాల శ్రీనివాస్, డీటీసీ, ఆదిలాబాద్

పాలిసెట్‌లో మనోళ్ల సత్తా

- జిల్లా విద్యార్థుల అత్యుత్తమ ప్రతిభ
- రాష్ట్రస్థాయి ర్యాంకులు కైవసం



అమీనా షిరీన్



సంజయ్ వెంకటస్వామి



కోలకొండ దేవిశ్రీప్రసాద్



పడిగెల అణన్య



యాళ్ల అభిజ్ఞ రెడ్డి



కన్నాల సంతోష్

ఆదిలాబాద్‌టౌన్: పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశం కోసం నిర్వహించిన పాలిసెట్ ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. జిల్లాలో మొత్తం 1,117 మంది ఈ పరీక్షకు హాజరయ్యారు. ఇందులో ఎంపీసీ విభాగంలో బాలికలు 88.91 శాతం, బాలురు 83.42 శాతం, అలాగే ఎంబైపీసీ విభాగంలో బాలికలు 91.54 శాతం, బాలురు 83.93 శాతం అర్హత సాధించారు. ఎంపీసీ విభాగంలో జిల్లాకేంద్రంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన అమీనా షిరీన్ రాష్ట్ర స్థాయిలో 41వ ర్యాంకు సాధించగా, జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈమె తండ్రి సయ్యద్ హైమద్ హుస్సేన్ ఆర్టీసీలో రిజర్వేషన్ ఇన్‌చార్జిగా పని చేస్తున్నాడు. అలాగే పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన ధర్మపురి సంజయ్ వెంకటస్వామికి 77వ ర్యాంకు వచ్చింది. ఇతని తండ్రి రామ్మోహన్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. పట్టణంలోని కుమార్‌పేట్‌కు చెందిన కోలకొండ దేవిశ్రీప్రసాద్‌కు 176వ ర్యాంకు వచ్చింది. ఇక ఎంబైపీసీ విభాగంలో మావల మండలం బట్టిసావర్గామ కు చెందిన పడిగెల అణన్యకు 204వ ర్యాంకు వచ్చింది. బోథ్‌మండలం కౌట(బి)కి చెందిన యాళ్ల అభిజ్ఞరెడ్డి 635వ ర్యాంకు సాధించింది. ఆదిలాబాద్ గాంధీనగర్‌కు చెందిన కన్నాల సంతోష్‌కు 645వ ర్యాంకు వచ్చింది. వీరు ర్యాంకులు సాధించడంపై ఆయా పాఠశాలల యాజమాన్యాలు ప్రత్యేకంగా అభినందించాయి.

స్మార్ట్ సిటీగా ఆదిలాబాద్

- మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్



వినతులు స్వీకరిస్తున్న మున్సిపల్ చైర్మన్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణాన్ని స్మార్ట్‌సిటీగా తీర్చిదిద్దేలా అభివృద్ధి పనులు చేపడుతున్నామని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. పట్టణంలోని 12వ వార్డు న్యూ హౌసింగ్‌బోర్డు కాలనీలో శుక్రవారం పుర ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. కాలనీవాసుల నుంచి మున్సిపల్ అధికారులు అర్జీలు స్వీకరించారు. పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రేమేందర్ మాట్లాడుతూ.. పట్టణాభివృద్ధికి రూ.320 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. భవిష్యత్‌లో కలెక్టరేట్, ఐటీ టవర్ ఏర్పాటవుతుందన్నారు. అలాగే తాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'పాలిటెక్నిక్'కు ఎన్‌బీఏ గుర్తింపు



జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని సంజయ్‌గాంధీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ కోర్సుకి ప్రతిష్టాత్మకమైన జాతీయ స్థాయి నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్(ఎన్‌బీఏ) గుర్తింపు లభించింది. ఈ ఏడాది మార్చి 24, 25, 26 తేదీల్లో ఎన్‌బీఏ నిపుణుల బృందం కళాశాలను సందర్శించి నాణ్యత ప్రమాణాలు తనిఖీ చేసింది. ఈ క్రమంలో అక్రిడిటేషన్ గుర్తింపు జారీకి సంబంధించిన సమాచారాన్ని కళాశాలకు ఈ–మెయిల్ ద్వారా పంపించారు. ఎన్‌బీఏ అక్రిడిటేషన్ గుర్తింపు కోసం కృషి చేసిన రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణ బోర్డు ఉన్నతాధికారులకు కళాశాల ప్రిన్సిపాల్ పి.భరద్వాజ కృతజ్ఞతలు తెలిపారు. ఈ గుర్తింపు ద్వారా కళాశాలలో చదివిన విద్యార్థుల సర్టిఫికెట్లకు అంతర్జాతీయ స్థాయిలో ప్రాధాన్యత లభించనుందని పేర్కొన్నారు.

అందని 'రైతుబంధు'



ఈయన పేరు ఇదపు దశరథ్. బోథ్(బి) శివారులో ఇటీవల 3.30 ఎకరాలు ఈయన పేరిట పట్టా అయింది. పాస్‌బుక్ సైతం అందింది. అయితే రైతుబంధు మాత్రం అందడం లేదని, అధికారులను అడిగితే ఆన్‌లైన్ కావాల్సి ఉందని చెబుతున్నారని అంటున్నాడు. త్వరగా రైతుబంధు వచ్చేలా చూడాలని కోరుతున్నాడు. ఇతనొక్కడే కాదు.. జిల్లాలో చాలామందిది ఇదే పరిస్థితి.

- కొత్త పాస్‌బుక్‌లు వచ్చినా జమకాని పెట్టుబడి సాయం
- ఇంకా ఓపెన్ కాని పోర్టల్
- జిల్లాలో 3,860 మంది ఎదురుచూపు



బోథ్: జిల్లాలో గతేడాది జూలై నుంచి ఇప్పటివరకు కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన వారంతా రైతుబంధు కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకున్న దాదాపు మూడు వేల మంది రైతుల దరఖాస్తు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు కాకపోవడమే జాప్యానికి కారణంగా తెలుస్తోంది. ప్రభుత్వం ఈ యాసంగి, వానాకాలం సీజన్‌లో పెట్టుబడి సాయం అందించే క్రమంలో రైతుబంధు పథకానికి 2022 డిసెంబర్ 20 వరకు కొత్తగా పాస్ పుస్తకాలు లభించిన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రకటించింది. జిల్లాల్లో వ్యవసాయ అధికారులు కూడా స్థానికంగా ప్రకటించారు. జనవరి 7వరకు గడువు విధించారు. ఈ క్రమంలో జిల్లాలోని 18 మండలాల్లో 3,860 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరంతా ప్రస్తుతం రైతుబంధు కోసం ఎదురుచూస్తున్నారు.

పోర్టల్ ఓపెన్ అయితేనే..

కొత్త పాస్‌పుస్తకాలు కలిగిన లేదా రిజిస్ట్రేషన్లు అయిన రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసి ప్రభుత్వం సాయం అందించాలి. ఇందులో భాగంగా భూమి కొనుగోలు చేసిన లేదా వారసత్వం కింద రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారు రైతుబంధుకు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. మరోవైపు ధరణి సమస్యలతో నిషేధిత జాబితాలో కొనసాగిన భూముల సమస్యలకు ఇటీవల పరిష్కారం లభించింది. అలాంటి వారికి పాస్ పుస్తకాలు వచ్చాయి. వారంతా మండల స్థాయిలో రైతుబంధుకు దరఖాస్తు చేసుకున్నారు. వారి వివరాలను ఏవో, ఏఈవోలు రైతుబంధు పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉంది. అయితే అప్పటి నుంచి ఇప్పటివరకు ఆ పోర్టల్‌లో అధికారులకు ప్రభుత్వం లాగిన్ అవకాశం ఇవ్వలేదు. దీంతో దరఖాస్తుదారుల వివరాలను వారు ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదు. ఫలితంగా ఆయా రైతులకు యాసంగి పెట్టుబడి సాయం అందలేదని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం జూన్‌లో లాగిన్ ఇచ్చే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.

పోర్టల్ ఓపెన్ కాకపోవడంతోనే ..

కొత్తగా పాస్ పుస్తకాలు పొందిన రైతుల వివరాలను పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. అయితే ప్రభుత్వం దీనిని త్వరలోనే ఓపెన్ చేసే అవకాశం ఉంది. ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే కొత్త రైతులకు రైతుబంధు డబ్బులు జమ అవుతాయి.

– పుల్లయ్య, జిల్లా వ్యవసాయాధికారి

అంగన్‌వాడీ.. కొత్త మార్గదర్శకాలు

- మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ నుంచి జారీ
- టీచర్, హెల్పర్ ఎంపికకు ఇక కనీస అర్హత ఇంటర్మీడియెట్
- వయోపరిమితి35 ఏళ్లకు కుదింపు
- ప్రాజెక్టు వారీగా రిజర్వేషన్ ఖరారుకు ఆదేశాలు
- ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ సెంటర్ల జాబితా తయారీకి ఆర్డర్



పోషణ పక్షం కార్యక్రమంలో జిల్లా కేంద్రంలోని ఖుర్షీద్‌నగర్ చిన్నారులు

సాక్షి,ఆదిలాబాద్: ప్రధాన అంగన్‌వాడీ టీచర్, మినీ అంగన్‌వాడీ టీచర్, హెల్పర్ ఎంపికలో ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ మేరకు మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కమిషనర్ భారతి హోళికేరి బుధవారం గైడ్‌లైన్స్ విడుదల చేశారు. ఇప్పటి వరకు వీటికి పదో తరగతి కనీస అర్హత ఉండగా తాజాగా ఇంటర్మీడియెట్‌కు పెంచారు. వయోపరిమితి కూడా కుదించారు. 18 ఏళ్ల నుంచి 35 ఏళ్లకే పరిమితి విధించారు. అలాగే ప్రాజెక్టు వారీగా రిజర్వేషన్ ఖరారుకు ఆదేశాల జారీతో సీడీపీవోలు వాటి తయారీలో నిమగ్నం కానున్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ సెంటర్ల జాబితా తయారు చేయాలని ఆర్డర్ ఇచ్చారు. ప్రధానంగా వందశాతం కేంద్ర నిధులతో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ జరుగుతుంది. ఈ నేపథ్యంలో ఖాళీల కారణంగా ఇటు లబ్ధిదారులకు పోషణ లభించకపోవడం, మరో పక్క ఎన్నో ఏళ్లుగా ఈ నిధులను పూర్తి స్థాయిలో వినియోగించకపోవడంతో నష్టం జరుగుతుంది. ఈ నేపథ్యంలోనే ఈ శాఖ ఖాళీల భర్తీపై దృష్టి సారించింది.

సూపర్‌వైజర్ పదోన్నతులతో మొదలు..

ఇటీవల ప్రధాన అంగన్‌వాడీ టీచర్లకు గ్రేడ్–2 సూపర్‌వైజర్ పదోన్నతులు కల్పించారు. ఆ సమయంలో వారికి డిగ్రీ అర్హతను పరిగణలోకి తీసుకుని ప్రమోషన్లు కల్పించారు. ఇక్కడ డిగ్రీ అర్హత తీసుకురావడం ద్వారా అంగన్‌వాడీల ఎంపికకు కనీస అర్హతను పదో తరగతి నుంచి ఇంటర్మీడియెట్‌కు పెంచే విధంగా ప్రక్రియ దోహదపడింది. అంగన్‌వాడీ నుంచి పదోన్నతులు పొందిన వారిలో కొంత మంది ప్రస్తుతం రాష్ట్రంలో సీడీపీవో స్థాయికి పదోన్నతి పొందడం గమనార్హం. ప్రధానంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీల నిర్వహణను ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతోఈమార్పులు,చేర్పులు చోటుచేసుకుంటున్నాయి.

ఖాళీలు అనేకం..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రధాన, మినీ అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలిస్తే.. ఆదిలాబాద్ జిల్లాలో ఐదు ప్రాజెక్టులకు గాను 1256 కేంద్రాలు, కుమురంభీమ్‌లో ఐదు ప్రాజెక్టులకు గాను 973, మంచిర్యాలలో నాలుగు ప్రాజెక్టులకు గాను 969, నిర్మల్‌లో నాలుగు ప్రాజెక్టులకు గాను 926 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తారు. అయితే ఉమ్మడి జిల్లాలో వందలాది అంగన్‌వాడీ టీచర్, హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటి భర్తీలో అధికారుల అలసత్వం కూడా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఆ శాఖ కమిషనర్ కొత్త నిబంధనలు రూపొందిస్తూ వాటి రిజర్వేషన్, రోస్టర్ పాయింట్, ఎ స్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ సెంటర్ల విధి, విధానాలు ఖరారు కు ఆదేశాలిచ్చారు. అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి సంబంధించి జిల్లా సెలక్షన్ కమిటీకి కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఐటీడీఏ పీవో సభ్యులుగా ఉన్నారు. ఇక నాన్ ట్రైబల్ ప్రాంతాల్లో ఆర్డీవో, డీడబ్ల్యూవో సభ్యులుగా వ్యవహరిస్తారు.

నిబంధనలు ఇలా..

- స్థానిక వివాహిత మహిళ అయి ఉండాలి.
- అర్బన్ ప్రాంతాల్లో అదే వార్డుకు చెంది ఉండాలి. గ్రామీణ ప్రాంతాల్లో సంబంధిత గ్రామ పంచాయతీకి చెంది ఉండాలి. ఏజెన్సీలో సంబంధిత హ్యాబిటేషన్‌కు చెందిన మహిళ అయి ఉండాలి.
- వితంతువు, ఒంటరి, అనాథ మహిళలను కూడా పరిగణలోకి తీసుకోవాలి.
- సెలక్షన్ ప్రక్రియ నిర్వహించే సంవత్సరం జూలై 1 నాటికి 18 నుంచి 35 ఏళ్ల వయోపరిమితి కలిగి ఉండాలి.
- మినీ అంగన్‌వాడీ టీచర్, హెల్పర్ల పదోన్నతులకు కూడా ఇంటర్ విద్యార్హత కలిగి ఉండాలి. వీరికి 45 ఏళ్ల వయో పరిమితి విధించారు. ఐదేళ్ల సీనియార్టీకి పరిగణలోకి తీసుకుంటారు. ఇందులోనూ అదే వార్డు, అదే గ్రామ పంచాయతీ, అదే హ్యాబిటేషన్‌కు చెంది ఉండాలి.
- ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ సెంటర్లలో సెంటర్లను ఎస్సీ, ఎస్టీ అభ్యర్థినులతోనే భర్తీ చేయాల్సి ఉంటుంది. దీని కోసమే జాబితా తయారీకి ఆదేశాలు ఇచ్చారు.
- నాన్ ఏజెన్సీ ప్రాంతాల్లో వంద పాయింట్ల ఆధారంగా భర్తీ ప్రక్రియ జరుగుతుంది. రిజర్వేషన్, రోస్టర్ పాయింట్ అమలు, విధి విధానాలు రూపొందిస్తున్నారు.

క్లుప్తంగా

వివాహిత అదృశ్యం

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని కేఆర్కే కాలనీకి చెందిన వివాహిత అదృశ్యమైనట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. వివాహిత ఈ నెల 24న కూలీ పనులకు వెళ్తానని చెప్పి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. దీంతో భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అగ్ని ప్రమాదంలో పశుగ్రాసం దగ్ధం



మంటలు ఆర్పివేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కుంటాల: మండలంలోని ఓలా శివారులో శుక్రవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో కుంటాలకు చెందిన బోయిన్‌పెల్లి మోహన్‌రావు, దొనికెని బాపన్న అనే రైతుల పశుగ్రాసంతో పాటు విద్యుత్ పరికరాలు దగ్ధమయ్యాయి. బాపన్న వరిని నూర్పిడి చేసి కట్టకట్టేందుకు ఉంచిన రూ.5వేల విలువచేసే పశుగ్రాసం, రూ.10వేల విద్యుత్ పరికరాలు, మోహన్‌రావుకు చెందిన రూ.20వేల విలువ చేసే పశుగ్రాసంతో పాటు క్వింటాల్ మొక్కజొన్న బుట్టలు, రూ.10వేల విద్యుత్ పరికరాలు కాలిపోయాయి. రైతులు భైంసా అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వగా సిబ్బంది మంటలు అదుపు చేశారు.

వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించాలి

ఉట్నూర్‌రూరల్: ఐటీడీఏ పరిధి లోని రైతులకు సహజ వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించి రైతుల అభ్యున్నతికి కృషి చేయాలని ప్రాజెక్టు ఉద్యాన అధికారి (పీహెచ్‌వో) గుడిమళ్ల సందీప్‌కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం రైతుల భాగస్వామ్యంతో పనిచేస్తున్న వివిధ రకాల ఎన్‌జీవోల ప్రతినిధులతో సమావేశమై చర్చించారు. ఉద్యాన, వ్యవసాయ పంటల సాగులో సహజ వ్యవసాయ పద్ధతుల అవశ్యకతను తెలియజేశారు. దీంతో నేల ఆరోగ్యాన్ని పునరుద్ధరించడం, వైవిధ్యాన్ని కాపాడుకోవడం, స్థానిక సహజ వనరులను సమర్థవంతంగా ఉపయోగించడం, పర్యావరణ న్యాయాన్ని ప్రోత్సహించడం, నీరు, తేమ సంరక్షణ సాధ్యమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆయా ఎన్‌జీవోల ప్రతినిధులు విఠల్‌రావు, సత్యనారాయణ, నవీన్, కమలాకర్, మంగమ్మ పాల్గొన్నారు.

నేడు బాసరకు ప్రధాని మోదీ సోదరుడి రాక

భైంసాటౌన్: దేశ ప్రధాని నరేంద్రమోదీ సోదరుడు ప్రహ్లాద్ మోదీ శనివారం బాసరకు రానున్నారు. శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారి దర్శనం అనంతరం భారతీయ తైలిక్ సాహు రాథోడ్ మహాసభ న్యూఢిల్లీ వారి సౌజన్యంతో నిర్వహించనున్న గాండ్ల తేలికుల రాష్ట్రీయ పరిచయ వేదికలో పాల్గొననున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు యశ్వంత్‌కర్ శంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి పలు రాష్ట్రాల నుంచి కులసంఘాల నాయకులు హాజరుకానున్నారని పేర్కొన్నారు.

పల్లె క్రీడా కెరటాలు

ప్రతిభ ఉండి గ్రామీణ ప్రాంతాలకే పరిమితమవుతున్న క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ పోటీలను ప్రారంభించింది. 18 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించగా ఈ నెల 15 ప్రారంభమైన మండల, జిల్లా స్థాయి క్రీడలు 24వ తేదీతో ముగిశాయి. జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈ నెల 28 నుంచి 31 వరకు హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. వారి అభిప్రాయాలు సాక్షితో ఈ విధంగా పంచుకున్నారు.

- సీఎం కప్ పోటీల్లో సత్తాచాటుతున్న గ్రామీణ యువత
- పలు విభాగాల్లో ప్రతిభ.. రాష్ట్రస్థాయికి ఎంపిక
- ఈ నెల 28 నుంచి 31వరకు రాష్ట్ర స్థాయి పోటీలు



రాష్ట్ర స్థాయిలో అవార్డు సాధిస్తా..



ఇంద్రవెల్లి: మా ఊరు ఇంద్రవెల్లి మండలంలోని మర్కగూడ గ్రామం. ప్రాథమిక స్థాయి నుంచే క్రీడలంటే చాలా ఇష్టం. అందులో ఖోఖో, రన్నింగ్, లాంగ్‌జంప్‌లో మంచి పట్టుంది. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సీఎం కప్ పోటీల్లో ఖోఖో విభాగంలో మండల, జిల్లా స్థాయిలో నిర్వహించిన క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచి అవార్డు అందుకున్నాను. రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యాను. హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో అవార్డు సాధిస్తాను.

– మాడవి ప్రశాంత్, ఖోఖో క్రీడాకారుడు

విజయం సాధిస్తాను..



నిర్మల్‌ఖిల్లా: సోన్ మండలంలోని కడ్తాల్ గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి ఇటీవల పూర్తయింది. మా అమ్మానాన్నలు మానస–స్వామి. 100 మీటర్ల పరుగు పందెంలో జిల్లా స్థాయిలో రెండో స్థానం దక్కడంతో సంతోషంగా ఉంది. అమ్మానాన్నలు, మా పాఠశాల ఉపాధ్యాయులు ఎంతో ప్రోత్సహించారు. మరింత ఉత్సాహంతో రాష్ట్రస్థాయిలో గెలుపు కోసం నావంతుగా ప్రయత్నం చేస్తాను. విజయం సాధిస్తాననే నమ్మకం ఉంది. – చిల్లా పల్లవి

ఆనందంగా ఉంది..



బజార్‌హత్నూర్: సీఎం కప్ జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాను. మా డేడ్ర గ్రామానికి రోడ్డు సౌకర్యం లేదు. మొబైల్ నెట్‌వర్క్ రాదు. ఆదిలాబాద్ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, జూనియర్ కళాశాలలో చదువు పూర్తి చేశాను. ప్రస్తుతం ఆదిలాబాద్‌లోని గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ డిగ్రీ కళాశాలలో బీఏ ఫైనల్ ఇయర్ చదువుతున్నాను. కబడ్డీలో ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి సీఎం కప్‌కు ఎంపిక కావడం ఆనందంగా ఉంది.

– కుమ్ర హన్మంతు, కబడ్డీ క్రీడాకారుడు

గెలుపే లక్ష్యంగా ముందుకు..



నిర్మల్‌ఖిల్లా: నాది సోన్ మండలంలోని కడ్తాల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి పూర్తయింది. సునీత, జనార్దన్ మా అమ్మానాన్నల ప్రోత్సాహం మరవలేనిది. జిల్లా స్థాయిలో నిర్వహించిన లాంగ్‌జంప్ పోటీల్లో ప్రథమ స్థానం దక్కింది. సీఎం కప్ పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం ఆనందంగా ఉంది. మా ప్రధానోపాధ్యాయులు బి.మహేందర్, పీఈటీ వెన్నెల ప్రోత్సాహంతోనే మొదటి స్థానం దక్కింది. సీఎం కప్ రాష్ట్ర స్థాయిలో ఎంపిక కావడంతో మరింతగా ఉత్సాహం నెలకొంది. తప్పనిసరిగా రాష్ట్రస్థాయిలో అవార్డును సాధిస్తాను. ఇలాంటి క్రీడలతో చాలామందికి క్రీడలపై మక్కువ పెరుగుతుంది. ప్రోత్సాహిస్తే ఆటల్లో రాణించేవారు చాలామంది ఉన్నారు. – పోలపల్లి నిఖిత

ఖోఖోపై మక్కువతోనే...



నిర్మల్‌ఖిల్లా: నాది నిర్మల్ మండలంలోని వెంగ్వాపేట్ గ్రామం. అమ్మ లక్ష్మి, నాన్న గంగాధర్ వ్యవసాయ పనులు చేస్తుంటారు. నాకు చిన్నప్పటి నుంచే ఖోఖో అంటే ఇష్టం ఎనిమిదేళ్లుగా ఖోఖో సాధన చేస్తున్నాను. ఇటీవల సీఎం కప్ పోటీల్లో మండలస్థాయి నుంచి జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చడంతో నెల 28 నుంచి 31 వరకు రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాను. పాఠశాల స్థాయి నుంచి తన ఫిజికల్ ట్రైనర్ భోజన్న, తన సీనియర్ రాకేష్‌ల ప్రోత్సాహం మరచిపోలేనిది. – ఆడెపు రాకేష్, ఖోఖో క్రీడాకారుడు

అమ్మానాన్నల ప్రోత్సాహంతోనే...



నిర్మల్‌ఖిల్లా: నా పేరు గాడి రవళిక. అమ్మా నాన్నలు గాడి లక్ష్మి, గోపాల్. సాధారణ దిగువ మధ్య తరగతికి చెందిన వ్యవసాయ ఆధారిత కుటుంబం మాది. నాకు చిన్నప్పటి నుంచే పాఠశాల స్థాయి నుంచి ఖోఖో అంటే ఇష్టం. ప్రస్తుతం రాష్ట్రస్థాయి టీంలో సభ్యురాలు కావడం సంతోషంగా ఉంది. దీంతో క్రీడాకారులుగా మాకు తగిన గుర్తింపు లభించినట్లుంది. గతంలో జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొన్నాను. ఈసారి సీఎం కప్‌లో పాల్గొని రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం ఆనందంగా అనిపిస్తుంది. తప్పనిసరిగా జట్టుతో కలిసి ఖోఖో పోటీలో విజయం సాధిస్తాం. క్రీడల్లో అమ్మానాన్నతో పాటు స్నేహితుల ప్రోత్సాహం మరవలేనిది.

– గాడి రవళిక, ఖోఖో క్రీడాకారిణి

రాష్ట్రస్థాయి పతకమే లక్ష్యం...



భరత్ సందీప్, లక్ష్మణచాంద

లక్ష్మణచాంద: నాది మండలంలోని వడ్యాల్ గ్రామం. చిన్నప్పటి నుంచే క్రీడలంటే ఇష్టం. సీఎం కప్ పోటీల్లో రాష్ట్రస్థాయి పతకం సాధించడమే లక్ష్యంగా ప్రాక్టీస్ చేస్తున్న. మండల స్థాయిలో షాట్‌పుట్‌లో మొదటి స్థానంలో, జిల్లా స్థాయి 10మీటర్లు పోటీలో విజేతగా నిలిచాను. దీంతో మంత్రి అల్లోల ఇంద్రకరన్‌రెడ్డి బహుమతి అందజేశారు. త్వరలో జరిగే రాష్ట్ర స్థాయిలో పతకం సాధిస్తాను.



మంత్రి అల్లోల ఐకేరెడ్డి చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న సందీప్

పరుగే నాకు ప్రాణం...



సారంగపూర్: నేను ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నాను. నాకు పరుగు అంటే ప్రాణం. చిన్నతనం నుంచి పరుగుపందెంలో పాల్గొని ప్రశంసలు పొందాను. పాఠశాల నుంచి దూరమయ్యాక నేను ఎక్కడ కూడా పరుగు పందెంలో పాల్గొనలేదు. నాకు సీఎం కప్ పోటీల్లో అవకాశం దొరికిందని ఎంతో సంబరపడ్డాను. అందుకే ఈ పోటీల్లో పాల్గొని జిల్లా స్థాయిలో గెలుపొందాను. రాష్ట్రస్థాయిలోనూ నా కంటూ ఓ ప్రత్యేకతను చాటుకుంటాననే నమ్మకం ఉంది.

– సేపాబాయి, దుర్గానగర్, సాయినగర్ తండా



లోకేశ్వరంలో వరి కొయ్యలను కాలుస్తున్న రైతు

నిప్పు పెడితే నష్టమే!

- వరి కొయ్య, గడ్డిని తగులబెట్టొద్దు
- మిత్ర పురుగులు, సూక్ష్మజీవులు చనిపోయే ప్రమాదం
- పొలం కలియదున్నితే భూసారం పెంపు

సాగుబడి

లోకేశ్వరం: వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. మరో 15రోజుల్లో ఖరీఫ్ పనులు మొదలవుతాయి. వరి కోత తర్వాత రైతులు కొయ్యలతో పాటు గడ్డిని కాల్చడం చేస్తుంటారు. దీంతో మిత్ర పురుగులు, సూక్ష్మజీవులు చనిపోతాయి. అలా కాకుండా రైతులు పొలంలో కలియదున్నడంతో భూసారం పెరుగుతుందని నిర్మల్ జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్ చెబుతున్నారు. మరిన్ని వివరాలు ఆయన మాటల్లోనే..

గడ్డిని కాల్చితే కాలుష్యం ...

- వరి కొయ్యలను తగులబెడితే అనర్థాలే.
- నేలకు మేలు చేసే క్రిమికీటకాలు నశించి భూసారం తగ్గిపోతుంది.
- మట్టిని కాపాడుకోవాలంటే, కొయ్యకాళ్లను కాల్చకపోవడమే మంచిది.
- గడ్డిని కలియదున్నితే సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుంది.
- భూసారంతో పాటు దిగుబడులు పెరిగి రైతుకు మేలు జరుగుతుంది.
- వరికొయ్యలను కాల్చడంతో వాతావరణ కాలుష్యం పెరుగుతుంది.
- విపరీతమైన వేడితో భూమి సారాన్ని కోల్పోతుంది.
- భూమికి పీచు పదార్థంగా ఉపయోగపడే అవశేషాలు కాలిపోతాయి.
- పంటలకు అవసరమైన ఖనిజ లవణాలు దెబ్బతింటాయి.
- మేలు చేసే సూక్ష్మజీవులు చనిపోతాయి. పొలాల్లో తిరిగే పాములు, ముంగీసలు, ఉడుములు, తొండలు ఇలా అనేక జీవరాశులు చనిపోయే ప్రమాదం ఉంది.
- దీంతో ప్రకృతి సమతుల్యత దెబ్బతింటుంది. గట్లు, మొరం గడ్డలపై ఉన్న పచ్చనిచెట్లు కూడా ఒక్కోసారి బుగ్గవుతున్నాయి.

ఒక్కసారి కాల్చితే 20ఏళ్లు వెనక్కి...

- కొయ్యకాళ్లను తగుల బెట్టడం వ్యవసాయానికి చేటు చేస్తుంది.
- వాతావరణంలో కాలుష్యం పెంచుతుంది.
- ఒకసారి కొయ్యకాళ్లను కాల్చితే వ్యవసాయం 20ఏళ్ల వెనుకబడినట్టే
- మట్టిలో కోటాను కోట్ల సూక్ష్మజీవులు ఉంటాయి.
- కొయ్యకాళ్లను తగుల బెట్టినప్పుడు ఇవన్నీ చనిపోతాయి. దీంతో భూసారం కోల్పోతుంది.
- రోటోవేటర్‌తో దున్నడంతో కొయ్యకాళ్లను చిన్నచిన్న ముక్కలుగా, పౌడర్‌గా మారుస్తుంది. తర్వాత రెండు బస్తాలు సూపర్ వేసి దున్నితే భూమి సారవంతంగా మారుతుంది.
- దీంతో ఎకరాకు పది ట్రాక్టర్ల మట్టి వేసినట్లు అవుతుంది. భూసారం పెరిగి పంట దిగుబడి పెరుగుతుంది.

కలియదున్నితే ఎన్నో ప్రయోజనాలు...

- వరి కొయ్యలు నేలలో కలియదున్నడంతో సేంద్రియ కర్బన శాతం పెరిగే అవకాశముంది.
- దుక్కి దున్నే సమయంలో సూపర్ పాస్ఫేట్ చల్లితే అవశేషాలు రెండు వారాల్లో మురిగి పోషకాలుగా అందుబాటులోకి వస్తాయి.
- ఫలితంగా డీఏపీ వాడకం సగం వరకు తగ్గుతుంది.
- కలియ దున్నితే ఎకరాకు దాదాపుగా టన్ను ఎరువు తయారవుతుంది.
- మొక్కలకు 2శాతం నత్రజని (యూనియా) 4శాతం పాస్ఫరస్ అదనంగా అందిస్తుంది.
- జింక్, మాంగనీస్, ఇనుము, కాల్షియం లాంటి సూక్ష్మధాతువులు పంటకు మేలు చేకూర్చుతాయి.
- నేలలో కరగని మూలకాలను అనుకూలంగా మార్చుతుంది. నీటి నిల్వ పెరుగుతుంది.

చిన్నారిపై దాడిచేసిన వీధికుక్క



దాడిలో గాయపడిన చిన్నారి

కడెం: వీధి కుక్క చిన్నారిపై దాడిచేసి గాయపరిచిన సంఘటన మండలంలోని కొండుకూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని పాత కొండుకూర్ గ్రామంలో చోటుచేసుకుంది. వెల్పుల మహేశ్, శిరీష దంపతు ల నాలుగేళ్ల కూతురు నిశ్వితపై వీధికుక్క దాడి చే యగా తీవ్రంగా గాయమైంది. గురువారం సా య ంత్రం ఇంటి సమీపంలో ఆడుకునే సమయంలో కు క్క దాడిచేసింది. దీంతో నిర్మల్‌లోని ప్రభుత్వ ఆ సుపత్రికి తరలించి చికిత్స అందించారు. కుక్కల దా డులతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు.

బాసరలో భక్తుల సందడి



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

భైంసాటౌన్: బాసరలో శుక్రవారం భక్తుల సందడి నెలకొంది. శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ముందుకు వేకువజామున గోదావరి నదిలో స్నానాలాచరించి పూజలు చేశారు. అనంతరం అమ్మవారి ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తల్లిదండ్రులు చిన్నారులకు అక్షరాభ్యాస పూజలు చేయించారు.

అపూర్వ సమ్మేళనం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాల పూర్వ ఛాత్రోపాధ్యాయుల అపూర్వ సమ్మేళనం అట్టహాసంగా సాగింది. 1997–98 బ్యాచ్‌కు చెందిన ఛాత్రోపాధ్యాయులు 25ఏళ్ల తర్వాత మళ్లీ ఒకచోట కలిశారు. పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్ వేదికగా నిలిచింది. ఉపాధ్యాయ వృత్తి కోర్సును అభ్యసించి విద్యార్థులుగా విడిపోయిన వారు ప్రస్తుతం వివిధ రంగాల్లో స్థిరపడ్డారు. చాలామంది ఉపాధ్యాయ వృత్తిలో రాణిస్తున్నారు. వివిధ జిల్లాలకు చెందిన వారు ఒక చోట కలిసి చదువుకున్నారు. తిరిగి వీరంతా ఒకచోట చేరడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పో యాయి. పరస్పరం యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. సెల్ఫీలు తీసుకుని సందడి చేశారు. తమ కు విద్యాబుద్ధులు నేర్పి ప్ర యోజకులుగా తీర్చిదిద్దిన గురువులను ఆహ్వానించి సన్మానించారు. పూర్వ అధ్యాపకులు విశ్వనాథ్‌రావు, రాజయ్య, పోశెట్టి, ప్రకాష్, రవీందర్, విజయ రామారావు, పూర్వ ఛాత్రోపాధ్యాయులు లస్మన్న, నీలాదేవి, శశిధర్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రఫుల్, చందర్‌రెడ్డి, అరుణ, నారాయణ ఉన్నారు.



ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

ఇంద్రవెల్లి: గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని ఎన్‌హెచ్‌ఎం, ఈసీఆర్‌పీ కేంద్ర తనిఖీ బృందం ప్రతినిధులు బాల సుబ్రహ్మణ్యం, ఎస్‌ఆర్ అనంత్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేశారు. ప్రజల ఆరోగ్య పరిస్థితి, ప్రజలకు అందుతున్న వైద్య సేవలతో పాటు సిబ్బంది పనితీరుపై, నేషనల్ ప్రోగ్రామ్ ద్వారా అమలు చేస్తున్న కార్యక్రమాలైన టీబీ నివారణ, మలేరియా, డెంగ్యూ, చిన్న పిల్లల ఇమ్యూనైజేషన్ కార్యక్రమాల అమలు తీరుపై ఆరా తీశారు. అనంతరం ఆస్పత్రి రికార్డులు పరిశీలించారు. టీహబ్ ద్వారా సేకరిస్తున్న రక్త నమూనాల సేకరణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని ప్రధాన్‌గూడ, ఈశ్వర్‌నగర్ గ్రామాల్లోని ఆరోగ్య ఉప కేంద్రాలను పరిశీలించి ప్రజలకు అందుతున్న వైద్య సేవలు అడిగి తెలుసుకున్నారు.



వివరాలు తెలుసుకుంటున్న కేంద్ర బృందం ప్రతినిధులు

ఆరోగ్య ఉపకేంద్రాల్లోనే ప్రాథమిక వైద్యం అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వైద్యం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. వైద్య సిబ్బంది నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం, ఈసీఆర్‌పీ కేంద్ర బృందం ప్రతినిధులు షాహిద్ అల్వర్షి, సంజీవ్ కుమార్ గుప్తా, హరిక్రిషన్, రాష్ట్ర ప్రోగ్రామ్ అధికారులు జె.శ్రీనివాస్, శ్రీకాంత్, వైద్యుడు శ్రీకాంత్ ఉన్నారు.

ఆస్పత్రుల తనిఖీ

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఢిల్లీకి చెందిన ఎన్‌హెచ్‌ఎస్‌ఆర్‌సీ బృందం శుక్రవారం తనిఖీ చేసింది. నేషనల్ హెల్త్ మిషన్ కింద జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు కేటాయించిన నిధులతో నిర్మించిన భవనాలను పరిశీలించారు. ఎనిమిది మంది సభ్యులు జిల్లాకు రాగా ఇచ్చోడ, ఇంద్రవెల్లి, రిమ్స్ ఆస్పత్రులను ఒక బృందం, నార్నూర్‌లోని గుంజాల, గాదిగూడలోని పల్సువాడ(బి)లను పరిశీలించింది. ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలను విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో ఉన్న సౌకర్యాలు పరిశీలించారు.